


# "రాధా మాధవీయం"

జోస్యుల నాగభూషణరావు

అలా అతణ్ణి ఎంత సేపటినుంచి చూస్తోందో ఆమెకే తెలియదు.

అతణ్ణి చూస్తుంటే చిత్రమైన మైమరపు.

రాత్రి పదకొండున్నర గంటలు.

మిల్టన్ 'పారడైజ్ లాస్ట్' చదువుతూ మధ్యలో కాస్త రిలీఫ్‌కోసం చల్లగాలి పీల్చుకుందామని పెరట్లోకి వచ్చింది.

అక్కడ పట్టెమంచంపై ఆదమరచి పడుకునివున్న అతణ్ణి చూసింది.

ఒంటిమీద లుంగీ తప్ప బనీనుకూడా లేదు.

సన్నని నడుము విశాలమైన ఛాతీ, వంపులు తిరిగిన కండలు... మంచి స్పోర్ట్స్‌మాన్‌లా వున్నాడు

చెరగని అందమైన జత్తు పెదవులపై చెదరని చిరుదరహాసం చూస్తుంటే ఆ చల్లని వెన్నెలలో అతనొక రాజకుమారుడులా వున్నాడు.

అలా అతడిని చూస్తున్నకొద్దీ ఆమె మనసు పట్టుతప్పుతోంది.

ఈ వివశత్వం యింతకుముందు ఎవరిని చూసినా ఆమెకు కలగలేదు.

కాలేజీలో ఆమె అంటే పడిచచ్చే

వాళ్ళు ఎంతోమంది వున్నారు.

కానీ ఎప్పుడూ ఎవరిని చూసినా ఆమెలో ఎలాంటి స్పందనా కలగలేదు.

అలాంటి తనకు వున్నట్లుండి ఏమవుతోంది?

ఏమిటి తనలో వువ్వెత్తున లేస్తున్న భావతరంగాలు?

అసలింతకూ ఎవరితను?

తమ పక్కవాటాలోకి నాలుగురోజుల క్రితమే అద్దెకు వచ్చినవాళ్ళ గెస్ట్ కావచ్చు.

వెల్లకిలా పడుకున్న అతను మెల్లగా ఆమెవైపుకు తిరిగాడు. నిద్రపోతున్నా ఆ మొహంలో ఎంత ఆకర్షణ!

ఇంటిమేట్ స్ప్రే చేసుకున్నాడులా వుంది.

అతని ఒంటిమీదినుంచి వస్తున్న ఆ సుగంధ పరిమళాలు వెన్నెల కెరటాలపై తేలివచ్చి అసలే వూహాలకందని మత్తులోమునిగిపోయిన ఆమెను మరింత గిలిగింతలు పెడుతున్నాయి

ఆమెలో ప్రస్ఫుటమవుతున్న వుద్వేగం ఆమెను నిలవనీయడంలేదు.

అడుగు ముందుకి పడటంలేదు.

వెనకకు వెళ్ళబుద్ధి కావడంలేదు.

'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అంటే ఇదే కాబోలు!

తను ఎన్నడూ వూహించని ప్రణయ భావాలు రేపుతూ అతను ఎంత ప్రశాంతంగా నిద్రపోతున్నాడు!

మరి కొంతసేపు అక్కడే వుంటే ఏమైపోతానో అన్న భీతితో అడుగులో అడుగువేసుకుంటూ గదిలోకి చేరుకుంది.

గదిలోకి వచ్చినా మదిలో కుదురేదీ?

ఏమీ చదవబుద్ధి కాలేదు.

పడుకుంది. నిద్రపట్టి చస్తేగా!

కళ్ళు మూసినా తెరిచినా అతని రూపమే మనసంతా నిండిపోయింది.

అలానే పొర్లుతూ పలవరిస్తూ ఏ మూలో జామునకు నిదురలోకి జారుకుందో ఏమో లేచేసరికి ఎనిమిదిగంటలయింది.

లేస్తూనే ఒక్క అంగలో దొడ్లోకి వెళ్ళి చూసింది.

అంతా ఎవరి పనులలో వాళ్ళున్నారు.

అతను మాత్రం కనిపించలేదు.

పక్కభాగంలోకి వచ్చిన వాళ్ళతో యింకా సాన్నిహిత్యం ఏర్పడలేదు.

అతని గురించి వాళ్ళను ఎలా అడుగుతుంది.

అలా ఎదురుచూస్తూనే ఆ రోజంతా గడిపింది. రోజులు వారాలు గడిచిపోయాయి

అతని జాడ తెలియలేదు.

అతని తలపు వీడిపోలేదు.

అందుకే అందమైన అతని రూపాన్ని అలానే పదిలంగా గుండెలో ప్రతిష్ఠించుకుని ఆరాధించసాగింది.

• • •

కరుణా నర్సింగ్‌హోమ్‌లో తన ఫ్రెండ్‌కి చిన్న ఆపరేషన్ జరిగితే

చూసిపోదామని వచ్చాడు అతను.

స్నేహితుడిని పరామర్శిస్తూ కూర్చున్న అతను యథాలాపంగా పక్క బెడ్ వైపు చూశాడు.

అంతే!

ఆ చూపులు మరలించుకోలేక పోయాడు.

స్నేహితుడు చెబుతున్న వివరాలు అతని మనసులోకి దూరడంలేదు.

ఎవరా అమ్మాయి?

అమ్మాయా? ఛ! కాదు!!

దేవలోకంనుంచి ఏదో విధివశాత్తు భువిపైకి దిగివచ్చిన అప్సరస కాదు గదా!

ఇస్త్రీ మడత నలగని తెల్లనిదుప్పటి కప్పిన పరుపుని హంసతూలికా తల్పం చేసుకుని హాయిగా పవళించి మధురోహా లలో తేలుతున్న మందాకిని.

అరచేతిమందం వెడల్పున్న ఎర్రని జరీ బోర్డరున్న తెల్లని పావడాపై నీలిరంగు ఓణీ అదే కలర్ బ్లౌజ్ వేసుకుని తారలా మెరిసిపోతోంది.

ఎడమచేతికున్న జత బంగారుగాజులు ఆమె శరీరఛాయ ముందు వెలవెలబోతున్నాయి.

వుంగరాలు తిరిగిన ముంగురుల నడుమ విశాలంగా ప్రకాశిస్తున్న ఆమె ఫాలభాగాన్ని చుంబిస్తున్నట్లున్న సిందూరం ఎంత పుణ్యం చేసుకుందో!

ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసలకు ఎగిరెగిరి పడుతున్న రొమ్ముల నడుమ చిక్కుకొని లయబద్ధంగా స్పందిస్తున్న బంగారులాకెట్ గొలుసు పూర్వజన్మలో ఏ బంగారు పూలపూజ చేసుకున్నదో!

ఎవరో కూడా తెలియని ఆమె గురించి తన మనసెందుకింతగా ఆరాట పడుతోంది.

పుట్టి బుద్ధెరిగిన తరువాత ఎంత మందిని చూడలేదు.

ఎప్పుడూ యిలా కాలేదే!

కాలేజీలో ఆటు ఆటలలోనూ యిటు స్టడీస్‌లోనూ ఎప్పుడూ ఫస్ట్ వచ్చే తనంటే ఎందరికో హీరో వర్షిప్!

తన క్రీగంటి చూపులకోసం ఎందరో అందమైన అమ్మాయిలు పడేపాట్లు చూసి నవ్వుకుని మెల్లిగా తప్పించుకుని తిరిగే వాడేకానీ ఎన్నడూ యిలాంటి అనుభూతి పొంది ఎరగడు.

ఆమెను చూసినప్పటినుంచీ రెప్ప వాల్చడం కూడా మరచి స్థాణువులా అయిన అతను ఫ్రెండ్ గట్టిగా పిలిచే సరికి బాహ్యప్రపంచంలోకి వచ్చాడు.

ఆమె ఎవరో అతని ఫ్రెండ్‌కు కూడా తెలియదు.

టాన్సిల్స్ ఆపరేషన్ చేయించుకుంది.

ఎనెస్థీషియా మత్తులో వుంది. మరో రెండు గంటలలో స్పృహ రావచ్చు.

అంతవరకూ తెలుసుకుని ఫ్రెండ్ వద్ద శలవు తీసుకుని వెళ్ళాడు.

అతనితోపాటు కేవలం అతని శరీరం మాత్రమే వెంట వెళ్ళింది.

అతని మనసుని ఆమె గుండెలాకర్లో సేఫ్ డిపాజిట్ చేశాడు.

సాయంకాలంవరకూ ఎలాగూ తమాయించుకుని ఇక వుండబట్టలేక మళ్ళీ నర్సింగ్‌హోమ్‌కి వెళ్ళాడు.

అతని ఫ్రెండు డిశ్చార్జీ చేయించుకునే ప్రయత్నంలో వున్నాడు.

అతని కళ్ళు పక్క బెడ్‌వైపు పరుగులు తీశాయి.

దానిపై ఒక చిన్న పిల్లవాడు, అతణ్ణి జోకొడుతూ ఒక మధ్య వయస్కురాలు.

ఆమె వెళ్ళిపోయింది.

మనసు మొద్దుబారిపోయింది.

ఫ్రెండు వాళ్ళతోపాటు యాంత్రికంగా బయటకు నడిచాడు.

ఆశాభంగంతో పిచ్చిపట్టినట్లనిపించి కనీసం ఆమె ఎవరో ఎడ్రసేమిటోనైనా ఎవరినీ అడగాలనిపించలేదు.

* * *

పెండ్లిచూపుల కార్యక్రమం మొదలైంది.

తన మనసులో గుడికట్టుకున్న దేవతను పొందలేనప్పుడు ఇక ఎవరైనా ఒకటే అనుకొని తల్లిదండ్రుల బలవంతం మీద అయిష్టమనస్కంగా వచ్చి మొక్కుబడిగా కూర్చున్నాడు అతను.

ఆమె తన హృదయంలో నిలుపుకున్న అజ్ఞాత యువకుని తాలూకు సుందరస్వప్నాలను చెరిపేసుకుని వాస్తవ జీవితంతో రాజీపడలేక అంతకన్నా వేరేగత్యంతరంలేక చేదు మాత్రను మింగినట్లుగా ముఖం పెట్టుకుని తల్లి నడిపించగా మెల్లిగా వచ్చి అందరి ముందూ కూర్చుంది ఆమె.

ఇరువైపులవారూ ఏవేవో మాట్లాడుకుంటున్నారు

వంచిన తలలు ఎత్తని వారిద్దరికీ అవేవీ వినిపించడంలేదు.

ఎవరి బాధలో వాళ్ళు వున్నారు!

"ఎంత సేపూ కోరస్ పాడేవాళ్ళలాగా మేం వాగడమేనా? మీరు కూడా ఏదైనా మాట్లాడండర్రా" అంటూ పెద్దలు వత్తిడి చేసేసరికి తప్పదనుకుంటూ యిద్దరూ ఒక్కసారే ఒకరినొకరు చూసుకున్నారు

అంతే! ఒక్కసారిగా ఇరువురిలోనూ ఒకే రకం స్పందన!

ఎక్కడ కూర్చున్నారో మరచిపోయారు.

తను ముందు ఏం జరుగుతుందో తెలియడంలేదు.

ఏమిటి? తన కలల పంట!

తన మనోభిరాముడు!!

తన రాజకుమారుడు!!!

ఆరోజు రాత్రి నుంచీ తను ఎదురు చూస్తున్న తన వెన్నెలదొర ఇలా తన ముందు సాక్షాత్కరించి తన జన్మకు ధన్యం చేస్తున్నాడా?

తన భాగ్యరాశి!

తన బంగారు చిలక!!

తన జీవన సామ్రాజ్ఞి!!!

కరుణా నర్సింగ్ హోమ్‌లో కనిపించి మురిపించిన తన హృదయేశ్వరి తిరిగి కరుణించి తన బ్రతుకును పండించ రానున్నదా?

వాళ్ళ మూగబాసలు ఎవరికీ అర్థం కావడంలేదు.

పెద్దలు ఏవేవో అడుగుతున్నారు.

వీళ్ళు అన్నింటికీ ఊకొడుతున్నారు.

అంతా తథాస్తు అన్నారు!

* * *

మొదటిరాత్రి!

నూతన వధూవరుల వలపులరాత్రి!!

రెండు హృదయాలు విందుగా పరవశించి ఏకమయ్యే పండుగరాత్రి!!!

ఒకరు ఒడిలో ఒకరు!

ఒకరికోసమే మరొకరు.

ఎవరు ఎవరితో ముందుగా ఏమని మాట్లాడాలో మరచిపోతున్నారు.

చూపులతోనే ఒకరి నొకరు తాగేసుకుంటున్నారు.

ఎంత తాగినా తనివితీరక తపించి పోతున్నారు.

సుషుప్తిలోంచి మెల్లగా వాస్తవంలోకి వస్తూ ముందుగా అతనే ఆమెలోకి ఒదిగిపోతూ తానామెను ఆనాడు నర్సింగ్ హోమ్‌లో చూసిన క్షణం నుంచి జరిగినదంతా పూసగుచ్చినట్లు ఆమె చెవిలో చెప్పాడు.

ఆమె మైమరచింది!

పిల్లనగ్రోవి పిలుపుకు పులకరించిన రాధలా పరవశించింది.

అప్పుడు మెల్లగా అలవోకగా పారే సెలయేటి గలగలల వలె అతనిలో లీనమైపోతూ అతనిని తన ఇంటి పెరట్లో ఆ రాత్రి వెన్నెల్లో చూసింది. మొదలు తాననుభవించిన మనోవేదన నంతా లయబద్ధంగా అతని గుండెల్లో కుమ్మరించింది

ఆమె పేరు రాధ!

అతను మాధవుడు!!

వారి అనుబంధమే

రాధామాధవీయం!!!

* * *

